సాక్షి బాపట్ల

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలిపూజ

తెనాలిఅర్బన్: తపస్సు కాలం మొదటి రోజును పురస్కరించుకుని చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించారు.



రైల్వే బ్రిడ్జి పనుల పరిశీలన

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం బైపాస్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం పరిశీలించారు.



కనులపండువగా కల్యాణోత్సవం

మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్బారాయుడి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది.

న్యూస్‌రీల్

మహా శివరాత్రి ఉత్సవాలకు సమన్వయంతో పనిచేయాలి



అమరావతి: మహా శివరాత్రికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అమరేశ్వర స్వామి ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ కోరారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 8వ తేదీ మహాశివరాత్రి ఉత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. దేవాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఈఓ వేమూరి గోపినాథశర్మతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల గడువు పెంపు

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో గ్రేడ్-2 ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 17 వరకు గడువు పొడిగించినట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభా రాణి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పది ఫార్మసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులను భర్తీ చేస్తామని, అభ్యర్థులు దరఖాస్తులను గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలన్నారు.

నేడు స్టాఫ్‌నర్సులకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 20 మందికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్ నర్సులుగా ప్రమోషన్ ఇవ్వనున్నట్లు ఆర్డీ డాక్టర్ జి.శోభరాణి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు ప్రమోషన్ జాబితాలో ఉన్నవారు ఉదయం 11 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు కీలకం

ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్‌రెడ్డి



బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ఆర్టీసీ సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాపట్లలోని డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం బుధవారం నిర్వహించారు. విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి డిపో నుంచి ముగ్గురు చొప్పున జిల్లాలో 15 మంది డ్రైవర్లకు ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు బస్సులు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించినట్లు చెప్పారు. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు మాట్లాడుతూ బస్సులు నడిపే ప్రతి ఒక్కరు మద్యపానాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీటీఓ సురేష్, బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె డిపో మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ ఇన్‌చార్జిలు, నాలుగు డిపోల నుంచి అన్ని అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో బుధవారం కల్యాణ తలంబ్రాలు కలిపే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 23న జరిగే గోపయ్య సమేత తిరుపతమ్మవారి కల్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు అందించేందుకు క్వింటా బియ్యాన్ని ముందుగా పసుపు, కుంకుమ, నెయ్యి, పలు సుగంధ ద్రవ్యాలతో కలిపించారు. వీటిలో కల్యాణ తలంబ్రాలను కలిపి కల్యాణ వేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులందరికీ పంపిణీ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు కాకాని అలేఖ్య, బోశెట్టి విజయలక్ష్మి, బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, వీర్ల రమణ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ సభకు సర్వం సిద్ధం

- ఫిరంగిపురంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం
- సర్వాంగ సుందరంగా సభావేదిక
- సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో హెలిప్యాడ్

ఫిరంగిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి అందించాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వలంటీర్లు నవరత్నాల లబ్ధిని ప్రతిఇంటికి అందించి ప్రజల మన్ననలు పొందారు. ఈ నేపథ్యంలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను గౌరవించాలనే ఉద్దేశంతో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అందుకు ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలోని సెయింట్ పాల్స్ గ్రౌండ్ వేదిక కానుంది. కార్యక్రమానికి సభా వేదిక సిద్ధం అయింది. పటిష్ట భద్రతా ఏర్పాట్లతో సభావేదికను సుందరంగా తీర్చిదిద్దారు. సభా ప్రాంగణంలో వేలాది మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వాహనాలు పార్కింగ్‌కు వీలుగా సభాస్థలికి సమీపంలోని పొలాలను శుభ్రం చేశారు. తాగునీటి సదుపాయం కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆటస్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సభా వేదిక వద్దకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయగా రోడ్డుకు ఇరువైపులా బ్యారికేడ్లు నిర్మించారు. భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

సభా వేదిక పరిశీలన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సభ ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి కార్యక్రమాలకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సభాస్థలి, బారికేడ్లు, వాహనాల పార్కింగ్, వంటి పలు అంశాలపై సమావేశంలో చర్చించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ పి.శ్రీకర్, పీడీఆర్డీ హరిహరనాథ్, డీడీ గ్రౌండ్ వాటర్ వందనం, పీఆర్ ఎస్ఈ జి.బ్రహ్మయ్య, సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధుసూదనరావు, జిల్లా సహకారశాఖ అధికారి వీరాచారి, డీఈఓ శైలజ, డీపీఓ శ్రీదేవి, డీఎం హెచ్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



దారికిరువైపులా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు

నేడు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలో గురువారం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ మళ్లించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీఎం రాష్ట్రస్థాయి గ్రామ సచివాలయాల వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ పరిధిలోని పీఎన్‌సీ కళాశాల ఎదురు ప్రాంగణంలో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరుకానున్నారని చెప్పారు. ఫిరంగిపురం మీదుగా ప్రయాణించే భారీ, మధ్య తరహా రవాణా వాహనాలను ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి వరకు మళ్లించినట్లు ఆయన పేర్కొన్నారు.

- గుంటూరు వైపు నుంచి నరసరావుపేట, వినుకొండ వైపు వెళ్ళే వాహనాలు గుంటూరు- యడ్లపాడు- చిలకలూరిపేట- నరసరావుపేట మీదుగా వినుకొండ వైపునకు వెళ్లాలి.
- గుంటూరు- పేరేచర్ల- సత్తెనపల్లి- ముప్పాళ్ల మీదుగా వెళ్లే వాహనాలు నరసరావుపేట వైపుగా వెళ్లాలి.
- వినుకొండ, నరసరావుపేట వైపు నుంచి గుంటూరు వెళ్లే వాహనాలు వినుకొండ- నరసరావుపేట- ఎస్ఆర్‌కేటి సెంటర్- చిలకలూరిపేట- యడ్లపాడు మీదుగా గుంటూరు వెళ్లాలి.
- వినుకొండ- నరసరావుపేట- ముప్పాళ్ల- సత్తెనపల్లి- పేరేచర్ల మీదుగా గుంటూరు వెళ్లాలి.

సభా స్థలానికి చేరుకునే మార్గాలు..

- ఇక వివిధ జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు మార్గాలు/ పార్కింగ్ ప్రదేశాలు కేటాయించినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు.
- గుంటూరు జిల్లాలోని తూర్పు, పశ్చిమ, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల నుంచి వచ్చే వలంటీర్ల బస్‌లు, ప్రజలు పేరేచర్ల- ఫిరంగిపురం మీదుగా సభా ప్రాంగణం(పీఎన్‌సీ కళాశాల) వద్దకు రావాలి.
- బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, అద్దంకి, పర్చూరు, సంతనూతలపాడు, చీరాల, గుంటూరు జిల్లాలోని తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల వలంటీర్ల బస్‌లు, ప్రజలు యడ్లపాడు- చిలకలూరిపేట- నరసరావుపేట- సాతులూరు మీదుగా సభా ప్రాంగణం (పీఎన్‌సీ కళాశాల ఎదురు)కు చేరుకోవాలి.
- పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, గురజాల, పెదకూరపాడు, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల వలంటీర్ల బస్‌లు, ప్రజలు నరసరావుపేట- సాతులూరు మీదుగా సభా ప్రాంగణం వద్దకు రావాలి.

పార్కింగ్ స్థలాలు..

- వాహనదారులు తమ వాహనాలను పీఎన్‌సీ కళాశాల నుంచి నరసరావుపేట వైపు రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేయాలి.
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్ల కార్లను సభా ప్రాంగణం ఎదురు వీవీపీ పార్కింగ్‌లో నిలుపుదల చేయాలి.
- 108తో పాటు ఇతర అత్యవసర వాహనాలు ఏమార్గంలోనైనా వెళ్లవచ్చునని, వాటిని అనుమతించాలని పోలీసులకు సూచనలు జారీ చేశారు.

సీఎం పర్యటన ఇలా ..

గుంటూరు వెస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం ఫిరంగిపురం మండలం రేపూడిలో వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరుకానున్నారు. వివరాలను సీఎం కార్యాలయం బుధవారం రాత్రి వెల్లడించింది. మధ్యాహ్నం 2.40 గంటలకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరుతారు. 2.45 తాడేపల్లిలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 3.05 చేరుకుంటారు. అక్కడ 10 నిమిషాల పాటు ప్రజాప్రతినిధులతో సమావేశమై 3.20కు సభావేదికకు చేరుకుంటారు. 3.20 నుంచి 4.50 వరకు వలంటీర్ల వందన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 4.55కు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 4.55 నుంచి 5.20 గంటల వరకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి బయలుదేరి 5.50 తాడేపల్లి హెలిప్యాడ్ వద్దకు, 5.55కు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో ముఖ్యమంత్రి పర్యటన ముగుస్తుంది.

ఓటరు జాబితాపై ఫిర్యాదులు పరిశీలించాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితా ఓటర్ల ఫైనల్ లిస్టు ప్రచురితమైన తర్వాత గత నెల 23 నుంచి ఇప్పటి వరకు 38,633 క్లెయిమ్స్, అభ్యర్థనలు వచ్చాయని వాటిని ఈఆర్‌ఓలు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్స్ పరిష్కరించి పేర్లను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని కోరారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

- కలెక్టర్ రంజిత్‌బాషా
- బల్లికురవ 'జగనన్నకు చెబుదాం'లో 432 అర్జీలు
- సమస్యలు విన్నవించిన వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పానెం చిన హనిమిరెడ్డి

బల్లికురవ: ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం స్పందనలో అర్జీలు స్వీకరించారు. 432 మంది అర్జీలు అందించారు. మండలంలోని సంగ మహేశ్వరపురం, చెన్నుపల్లి, అగ్రహారాల్లో రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సంగమేశ్వరపురం, అగ్రహారంలో జగనన్న భూహక్కు భూసర్వేలో భాగంగా రీ సర్వే పూర్తి అయిందని రైతులు పాస్ పుస్తకాలు కోసం రైతులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కోణిదెన రెవెన్యూలోని ఈర్లకొండ నుంచి వచ్చే సీనరీజ్ ఆదాయం గతంలో కొణిదెన, నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, కె.రాజుపాలెం పంచాయతీలకు వచ్చేదని, అయితే ఇటీవల కాలంలో కోణిదె పంచాయతీకే చేందేలా మార్పు చేశారని దీంతో మిగిలిన మూడు పంచాయతీల అభివృద్ధి జరగటం లేదని వివరించారు. గతంలో మాదిరిగా నాలుగు పంచాయతీలకు వాటా దక్కేలా చూడాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే అర్జీలకు అధికారులు జవాబుదారీతనంతో వెంటనే పరిష్కరించాలని కోరారు. జగనన్న కాలనీలో పక్కాగృహాల నిర్మాణాలను నూరు శాతం పూర్తి చేయించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కొప్పరపాడు, కూకట్లపల్లి, మల్లాయపాలెం, బల్లికురవ, కొణిదెన, అంబడిపూడి, వైదన గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, రక్షిత మంచినీరు, ఆక్రమణలు, విద్యుత్, వీధి కుక్కల సంచారం వంటి సమస్యలుండటంతో తక్షణమే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులు, సెక్రటరీని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ వెంకట రమణ, చీరాల ఆర్డీఓ జి.సూర్యనారాయణ రెడ్డి, తహసీల్దార్ ఎం.సుభద్ర, ఎంపీడీఓ హనుమారెడ్డి, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ చింతల అంజలి పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- దమ్మనవారిపాలెంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

దమ్మనవారిపాలెం(కర్లపాలెం): రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. గ్రామంలో రూ.22 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతి సచివాలయం పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారని చెప్పారు. గ్రామాలలో 104 వైద్య శిబిరాల ద్వారా కూడా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ వైద్యులు వారి ఇళ్లకే వెళ్లి వైద్య సేవలందించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా రూ.25 లక్షల విలువైన వైద్యం వారికి నచ్చిన కార్పొరేట్ ఆస్పత్రులలో ఉచితంగా చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ కె.బుల్లియ్య, పార్టీ నాయకులు వర ప్రసాద్, పరమానందకుమార్, పెదశ్రీనివాసరెడ్డి, నాగరాజు, సాగర్, శివారెడ్డి, భావన్నారాయణ, మీరయ్య, తాజ్, సుబ్బారావు, డాక్టర్ గోపీనాథ్, ఎంపీడీఓ కె.నేతాజీ, తహసీల్దార్ నిర్మలానందబాబా, కార్యదర్శి సునీత, వీఆర్వో పోతురాజు ఉన్నారు.



దమ్మనవారిపాలెంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధం

- బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా వెల్లడి

బాపట్ల: సాధారణ ఎన్నికలు అత్యంత పారదర్శకతతో నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఫొటోలు డబల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు తొలగింపులో నిర్లిప్తంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు తొలగించలేదని వస్తున్న ఆరోపణలను సుమోటోగా స్వీకరించి విచారిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 50 మంది బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులపై 2,08,740 దరఖాస్తులు అందినట్లు వివరించారు. వాటిలో 32,056 దరఖాస్తులను తిరస్కరించగా, 906 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, మిగిలినవన్నీ పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రతిరోజు 500 దరఖాస్తులు

ప్రతిరోజు ఆన్‌లైన్ ద్వారా సుమారుగా 500 దరఖాస్తులు నమోదు అవుతున్నాయని చెప్పారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అన్ని సూచనలు ఇచ్చామని తెలిపారు. ఎన్నికలు ముందు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సవరణ చేసిన తుది జాబితా ప్రచురిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు వాటిని అందిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల చిరునామాల మార్పు అంశాన్ని నిబంధనల మేరకు ఎన్నికల కమిషన్ అనుమతుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 1,500ల మందికి మించి ఓటర్లు ఉంటే అలాంటి ప్రాంతాల్లో ఓటర్ల సౌలభ్యం కొరకు రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, కలెక్టరేట్ ఏఓ కృష్ణకాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆమ్ ఆద్మీపార్టీ, సీపీఐ నాయకులు మాల్యాద్రి, షేక్ మహమ్మద్ గౌస్ బాషా, రామకృష్ణ, డి.రవి, జి.నాగరాజు, ఏ బాలాజీరెడ్డి, ఎస్.కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై నివేదిక ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కొల్లూరు: కృష్ణా నదిలో చేపట్టిన ఇసుక తవ్వకాలపై మైనింగ్ శాఖాధికారులు నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కృష్ణా నది తీరం మండలంలోని జువ్వలపాలెం వద్ద గతంలో చేపట్టిన ఇసుక తవ్వకాలను బుధవారం పరిశీలించారు. ఇసుక తవ్వకాలపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఇసుక తవ్వకాలపై స్థానికులను ఆరా తీశారు. ప్రస్తుతం జువ్వలపాలెం ప్రాంతంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు చేయడం లేదని అధికారులు తెలపడంతో గతంలో చేపట్టిన తవ్వకాలపై నివేదికలు అందజేయాలని కోరారు. నిబంధనల మేరకు తవ్వకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌలురైతు సంఘం నాయకుడు తోడేటి సురేష్, కృష్ణా నదిలో చేపడుతున్న ఇసుక అక్రమ తవ్వకాల గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. మండలంలోని పెసర్లంక- పెదలంక గ్రామాల పరిధిలో అరవింద వారధి సమీపంలో చేపడుతున్న తవ్వకాల కారణంగా రైతుల పంట భూములు కోతకు గురవడంతో పాటు, అరవింద వారధికి ముప్పు పొంచి ఉందని వివరించారు.



జువ్వలపాలెంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య



మార్టూరు: పరీక్షలు సరిగ్గా రాయలేనేమోననే బెంగతో మానసిక ఒత్తిడికి గురైన ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం సాయంత్రం మార్టూరులో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బలరాం కాలనీకి చెందిన తిరుమలశెట్టి నాగేశ్వరరావు కుమార్తె ప్రవల్లిక (16) చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. త్వరలో జరగబోతున్న పరీక్షలు సరిగా రాయలేనేమోనని తరచూ స్నేహితులతో చెప్పే ప్రవల్లిక మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయం

కలెక్టర్ పి.రంజిత్‌బాషా



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

బాపట్ల: ఎస్సీ సామాజిక వర్గం నుంచి తొలి ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి దామోదరం సంజీవయ్య కృషిని కలెక్టర్ రంజిత్‌బాషా వివరించారు. ప్రభుత్వమే అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిణి జె.రాజదిబోరా, సహాయ సంక్షేమ అధికారులు సత్యనారాయణ, సైదారెడ్డి, యువస్వరూప, ఆశాఖ పర్యవేక్షకులు ఏ.శ్రీనివాసరావు, రమణారెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా వసంత పంచమి



రాధాశ్యామ్ సుందరులకు పుష్పాభిషేకం నిర్వహిస్తున్న ముకుంద మాధవ్‌దాస్

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలోని ఇస్కాన్ టెంపుల్‌లో బుధవారం రాధాశ్యామ సుందరుల 22వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షుడు చక్రధరిదాస్ మాట్లాడుతూ రాధాశ్యామ సుందరుల వార్షికోత్సవం, వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున మంగళహారతి, పూజలు నిర్వహించామని తెలిపారు. భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం రాధా శ్యామసుందరులకు 1000 కేజీల పుష్పాలతో అభిషేకం చేశామని చెప్పారు. 108 రకాలతో భాగా సమర్పించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని ఆయన వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు ముకుంద మాధవదాస్, పాతూరి నాగభూషణం, ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.

చందూస్ కప్ విజేత విజ్ఞాన్



విజ్ఞాన్ యూనివర్సిటీకి బహుమతి ప్రదానం చేస్తున్న కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): 27వ చందూస్ సిల్వర్ క్రికెట్ కప్ విజేతగా విజ్ఞాన్ యూనివర్సిటీ నిలిచింది. బుధవారం స్థానిక జేకేసీ కళాశాలలో జరిగిన ఫైనల్స్‌లో ఆ జట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ జట్టుపై విజయం సాధించింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ విజేతలకు కప్‌ను, రన్నర్స్‌కు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జట్టు ఎంతో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిందని తెలిపారు. తమ కళాశాల మొదటి నుంచి విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావు, కుప్పుస్వామి, పరుచూరి గోపీచంద్, రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

అప్రమత్తం.. 'ప్రత్యేక' వైద్యం

- నిలకడగా అందరి ఆరోగ్యం
- 41 మంది డిశ్చార్జి
- 24 గంటలూ విధుల్లో ప్రత్యేక వైద్య బృందాలు
- సహాయ కేంద్రం కౌంటర్ ఏర్పాటు

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: వాంతులు, విరేచనాలతో గుంటూరు జీజీహెచ్‌లో ఈనెల 10వ తేదీ నుంచి చికిత్స పొందుతున్న వారికి సూపర్‌స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నారు. సూపర్‌స్పెషాలిటీ వైద్యులైన నెఫ్రాలజిస్టులు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, కార్డియాలజిస్టులు 24 గంటలూ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరితోపాటు జనరల్ మెడిసిన్ వైద్యులు, డెప్యూటీ సూపరింటెండెంట్లు, డెప్యూటీ ఆర్ఎంఓలు, అసిస్టెంట్ ఆర్ఎంఓలు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, ఫార్మసీ సిబ్బంది, బయోమెడికల్ ఇంజినీర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లతోపాటు, ఆఫీస్ సిబ్బంది, ఆరోగ్య మిత్రలు, సార్జంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మూడు పూటలా అందుబాటులో ఉంటూ బాధితులకు సకాలంలో స్పెషాలిటీ వైద్యం అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. ఆసుపత్రి అత్యవసర సేవల విభాగంలో నూతనంగా నిర్మించిన ఐసీయూతోపాటు, ఇన్ పేషెంట్ విభాగంలో ఆధునికీకరించిన జనరల్ సర్జరీ వార్డులో బాధితులను ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ 24 గంటలూ వైద్యులు, వైద్య సిబ్బందిని మానిటరింగ్ చేసుకుంటూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండి, నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నారు.

తక్షణమే వైద్యం అందేలా..

ఆసుపత్రిలో 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 139 మంది వాంతులు, విరేచనాలతో చికిత్స కోసం చేరారు. వీరిలో ఆరోగ్యం కుదుటపడి 41 మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం 98 మంది చికిత్స పొందుతున్నారు. బాధితులకు, కుటుంబ సభ్యులకు తక్షణమే సాయం అందించేందుకు క్యాజువాల్టీలో ప్రత్యేకంగా సహాయ కేంద్రం కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. అందులో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండి, బాధితులకు సమాచారాన్ని, సహాయాన్ని, సహకారాన్ని అందిస్తున్నారు.

యంత్రాంగం ప్రత్యేక దృష్టి

వాంతులు, విరేచనాల కేసులు జీజీహెచ్‌కు వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై గుంటూరు జీజీహెచ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఇతర అధికారులు, నేతలు ప్రతిరోజూ ఆసుపత్రిలో రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లి రోగులను పరామర్శించి ధైర్యం నింపుతున్నారు. బాధితుల ఇళ్ల వద్దకు సైతం వెళ్లి వారికి మనోధైర్యం కల్పిస్తున్నారు. బాధితుల సంఖ్య కట్టడి చేసేందుకు ఇంటింటికి తిరిగి వైద్యులు, వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి శాంపిల్స్ సేకరించి వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఏరియాల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తక్షణ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా 108 అంబులెన్సులను సైతం అందుబాటులో ఉంచి ఎవరికైనా తీవ్ర అస్వస్థత ఏర్పడితే తక్షణమే వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రాణ రక్షణే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం, వైద్యులు, వైద్య అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో లభిస్తున్న వైద్యసేవలపై, ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవకు బాధిత కుటుంబాలు సైతం హర్షం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

రేపు కంతేరు నర్సరీలో చెట్ల ఫలసాయానికి వేలం

తాడికొండ: గుంటూరు జిల్లా కంతేరులోని ప్రభుత్వ నర్సరీలో చెట్ల ఫలసాయానికి సంబంధించి వేలం నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి 40 మామిడి మొక్కలు, 180 మామిడి మొక్కలు, 40 సపోటా, 50 కొబ్బరి మొక్కలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. పాటదారులు ముందుగా ధరావత్తు రూ.5 వేలు జిల్లా ఉద్యాన అధికారి, గుంటూరు వారి పేరుమీద కానీ లేదా వేలానికి గంట ముందు నేరుగా గానీ చెల్లించాలని తెలిపారు. ఇతర నియమాలు అన్నీ అధికారుల ఆదేశాల మేరకు వర్తిస్తాయన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మోపిదేవి

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో నిత్యం భగవనామస్మరణ చేస్తూ ఉండాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.26లక్షలతో పెద కూరగాయల మార్కెట్ సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టణంలోని సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా పని చేస్తున్నామని చెప్పారు.పట్టణ ప్రజలు చిరస్థాయిగా చెప్పుకునే విధంగా ఓల్డ్ టౌన్‌లో రహదారి నిర్మాణం చేశామని తెలిపారు. రాణి సత్రం, రైతు బజార్, అంబేడ్కర్ భవన నిర్మాణం, పాలిటెక్నిక్ కళాశాల, ఇండోర్ స్టేడియం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. రహదారి నిర్మాణంలో దెబ్బతిన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని రూ.25లక్షలతో పునర్నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు వరసిద్ధి వినాయక ఆలయానికి అవసరమైతే ఎంపీ నిధులు సమకూరుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వార్డు కౌన్సిలర్ రెడ్డి శివశంకర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ మృతిపై కొనసాగుతున్న విచారణ

శ్రీనాథ్ అత్త, మామను విచారించిన సీఐడీ

నగరంపాలెం: ఎన్ఆర్ఐ యువకుడు గంగూరి శ్రీనాథ్ అనుమానాస్పద మృతి కేసులో విచారణ పర్వం కొనసాగుతుంది. ఈ క్రమంలో మృతుడి అత్త, మామను రెండు రోజులు ఏపీ సీఐడీ పోలీసులు విచారించారు. 2022 అమెరికాలో ట్రెక్కింగ్‌కు శ్రీనాథ్, భార్య సాయి చరణి వెళ్లారు. అయితే అక్కడ భర్త శ్రీనాథ్ జారిపడి మృతిచెందినట్లు భార్య ఇరువురి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. అయితే కొడుకు మరణంపై అనుమానాలు ఉన్నాయంటూ శ్రీనాథ్ తండ్రి బాబురావు సీఐడీ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో శ్రీనాథ్ మృతిపై గత డిసెంబర్‌లో భార్య సాయిచరణి, అత్త రాజశ్రీ, మామ సుఖవాసి శ్రీనివాసరావుపై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం విధితమే. ఈ క్రమంలో మంగళవారం సుఖవాసి శ్రీనివాసరావును గుంటూరు రీజినల్ సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగగా, మధ్యాహ్నం రెండు గంటలుపాటు భోజనానికి విరామం ఇచ్చారు. ఇక గుంటూరు జేకేసీ కళాశాల రోడ్ విజయపురికాలనీలో ఉంటున్న సుఖవాసి రాజశ్రీని బుధవారం విచారించారు. ఉదయం 11.30 గంటలకు మొదలైన విచారణ రెండు గంటలపాటు చేపట్టారు. మరో వారం రోజుల్లో తదుపరి విచారణ ఉంటుందని సమాచారం.

వైభవంగా నృసింహుని మాలదీక్ష స్వీకరణ



మాలధారులకు వస్త్రాలు బహూకరిస్తున్న ఎమ్మెల్సీహనుమంతరావు, చిరంజీవి

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న పానకాల లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో బుధవారం వైభవంగా నృసింహుని మండల మాల దీక్ష స్వీకరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సేవ ట్రస్టీ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి పాల్గొని నృసింహాని భక్తులకు మాలధారణ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవిలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసరావు శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్ల సేవ ట్రస్ట్ పేరుతో ప్రతి ఏడాది నృసింహుని మాల ధారణ భక్తులకు దుస్తులను అందించడంతో పాటు, 41 రోజుల పాటు, దిగువ సన్నిధి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలి విడతగా 140 మంది భక్తులు స్వామి వారి మండల దీక్ష స్వీకరించారు. దీక్ష స్వీకరించిన భక్తులకు దీక్ష వస్త్రాలను తోట శ్రీనివాసరావు ఉచితంగా అందజేశారు. నృసింహుని మండల దీక్ష స్వీకరణకు మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక పెదకూరపాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారని నిర్వాహకులు తెలిపారు. మార్చి 5న అర్థమండల దీక్ష, మార్చి 15న 11 రోజుల దీక్ష స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నృసింహుని దీక్షను స్వీకరించే భక్తులకు ఉచితంగా దుస్తులను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలరెడ్డి, ఈదులమూడి డేవిడ్ రాజు, మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, చిన్ని, తిరుపతయ్య, మాదాల అజయ్, పేరకలపూడి సర్పంచ్ గంగాధర్ రజనీకాంత్, వజీర్ సుల్తాన్, సుధారాణి. వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

18న గ్రూప్-2 ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థుల కోసం ఈనెల 18న డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం సదస్సు పోస్టర్‌ను బ్రాడీపేటలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విడుదల చేశారు. గ్రూప్–2 సిలబస్‌తో పాటు పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రామాణికమైన పుస్తకాల గురించి వివరిస్తామని తెలిపారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులందరికీ భారత సమాజం, చరిత్ర–ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పుస్తకాలను ఉచితంగా అదంజేస్తామన్నారు. ప్రిలిమినరీ, మెయిన్స్‌లో ఉండే సిలబస్ మొత్తాన్ని సదస్సులో వివరిస్తారని, నిరుద్యోగ ఉద్యోగార్థులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులందరూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 94900 99992, 97057 47318 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, రూపస్, పవన్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ఎన్నారై అకాడమీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో తిలక్‌బాబు, ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎన్నారై అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు తెలిపారు. బుధవారం లక్ష్మీపురం క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు జవ్వాది జగన్నాథ సూరి 99.85, మార్తుల వెంకట నాగరోహిత్ 99.82, నేరెళ్ల లీలా వెంకటసాయి 98.49, పులి వంశీకృష్ణ 98.24, కుమ్మిత బ్రహ్మారెడ్డి 97.92, షేక్ అబ్దుల్ మన్నన్ 96.71, అందెల సామ్యశ్రీ 96.20 పర్సంటైల్ సాధించి సత్తా చాటారని పేర్కొన్నారు. వివిధ సబ్జెక్టుల్లో 100 మందికి పైగా విద్యార్థులు 95కు పైగా పర్సంటైల్ సాధించడం గర్వకారణమని తెలిపారు. గత రెండేళ్లుగా ప్రణాళికాబద్ధమైన బోధనతో తాజాగా అత్యుత్తమ ఫలితాలు సాధించామని చెప్పారు. ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులను కృతజ్ఞతలు తెలియజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపకులను తిలక్‌బాబుతో పాటు సీఈఓ సీహెచ్. ఉమామహేశ్వరరావు సన్మానించారు. కార్యక్రమంలో డీన్ శర్మ, వివిధ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరావు, నాగ చౌదరి, కృష్ణారెడ్డి, రమణయ్య, లక్ష్మణరావు, శివన్నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, చిత్రంలో శిక్షణ ఐపీఎస్ అధికారి, ఏఎస్పీలు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్ పరిశీలన
- ఫిరంగిపురంలో పోలీస్ అధికార, సిబ్బందితో సమావేశం

నగరంపాలెం: ఈనెల 15వ తేదీన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫిరంగిపురం పర్యటన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. ఫిరంగిపురంలో గురువారం జరగనున్న వలంటీర్‌కు వందనం కార్యక్రమం దృష్ట్యా బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. తొలుత ట్రయల్ కాన్వాయ్‌లో పర్యటించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమంలో వీఐపీలు, మంత్రులు, ముఖ్య అధికారులు, వలంటీర్లు, ప్రజలు హాజరుకానున్నారని, ఈ క్రమంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సీఎం బందోబస్తుని డ్యూటీ సెక్టార్స్‌గా విభజించామని అన్నారు. ఆయా సెక్టార్స్‌లలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, కాన్వాయి పార్టీ, రోప్ పార్టీల విధుల నిర్వహణపై పూర్తి వివరాలను వారికి బ్రీఫ్ చేయాలన్నారు. రూఫ్‌టాప్‌లలో విధులు నిర్వహించే వారు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో ట్రాఫిక్, వాహనాల నిలుపుదల విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్‌హెగ్డే, జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), కె.శ్రీనివాసరావు (ఎల్ అండ్‌ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), హనుమంతు (ఏఆర్), పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.